ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5



అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 17 మే 2025

రెన్యూతో ఎనర్జీ విప్లవం

- ఇది పరిశ్రమే కాదు.. ఉద్యమం కూడా..!
- ప్రతి మెగావాట్ విద్యుత్ ప్రపంచానికి సందేశం
- చారిత్రక ఘట్టంలో భాగం కావడం నా అదృష్టం
- ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- బేతాపల్లి వద్ద రెన్యూ ప్రాజెక్టుకు శంకుస్థాపన

రెన్యూ పవర్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు శంకుస్థాపన దేశంలో క్లీన్ ఎనర్జీ విప్లవానికి పునాది రాయి అని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గుత్తి మండలం బేతాపల్లి సమీపంలో రూ.22 వేల కోట్లతో ఏర్పాటు చేస్తున్న 4.8 గిగా వాట్ల హైబ్రిడ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు ఆయన శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో తాను భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ ప్రాజెక్టు గ్రిడ్‌లకు శక్తినిస్తుందని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని అన్నారు. ఇది పరిశ్రమ మాత్రమే కాదని, ఒక ఉద్యమమని అన్నారు. రెన్యూలో ఉత్పత్తి అయ్యే ప్రతి మెగా వాట్ విద్యుత్ ప్రపంచానికి ఒక సందేశం ఇస్తుందని అన్నారు. భారత దేశాన్ని ముందుండి నడిపించే శక్తి రథానికి మన రాష్ట్రం సారథ్యం వహిస్తుందని అన్నారు. దీనికి సీఎం చంద్రబాబుకు ఉన్న బ్రాండ్ ప్రధాన కారణమని లోకేశ్ అన్నారు.







తపోవనంలో జన స్వాగతం

బేతాపల్లిలో రెన్యూకు శంకుస్థాపన



- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఆశయ సాధనలో భాగస్వాములం అవుతావనిఇ రెన్యూ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా అన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ రంగంలో కొత్త శకానికి నాంది పలికామని, విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, ప్రగతిశీల పాలన, ధృఢమైన సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా ముందుకు దూసుకువెళుతోందని అన్నారు.

(వివరాలు మెయిన్‌లో, 6లో)

లక్ష్యం మేరకు పనులు చేయాల్సిందే

మంత్రి పయ్యావుల కేశవ్



కాలువ పనులను పరిశీలిస్తున్న మంత్రి

ఉరవకొండ, మే 16(ఆంధ్రజ్యోతి): అనుకున్న లక్ష్యం మేరకు జూలై పదో తేదీకి హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు పూర్తి చేయాలని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. మండలంలోని కౌకుంట్ల సమీపంలో 36వ ప్యాకేజీలో 204కి.మీ నుంచి 210కి.మీ వరకు జరుగుతున్న పనులు మంత్రి శుక్రవారం తనిఖీ చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులు శరవేగంగా చేపట్టాలని ఆదేశించారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు, బ్రిడ్జి పనులు, మట్టి తొలగింపు పనులన్నీ త్వరగా పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు ఎర్రిస్వామి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ మహానాడు

పట్టణం శివారు అనంతపురం-బళ్లారి బైపాస్ రోడ్డులో శనివారం నియోజకవర్గ టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మంత్రి కేశవ్ హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడు తిరంగా యాత్ర

- జాతీయ జెండాతో రండి
- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, మే16(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయోత్సవంలో భాగంగా సైనికులకు సంఘీభావంగా శనివారం జిల్లా కేంద్రంలో తిరంగా యాత్ర చేపట్టనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు.ఆర్ట్స్ కళశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు యాత్ర చేస్తామన్నారు. అన్నివర్గాల ప్రజలు జాతీయజెండాను చేతపట్టుకుని, పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

పెళ్లింటికి చల్లటి కబురు..!

కూతురు పెళ్లికి దాచిన బంగారం చోరీ




స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులు

- కువైట్‌లో 20 ఏళ్లు కష్టపడి సంపాదించిన తండ్రి
- గతనెల 30న రాయచోటిలోని ఇంట్లో చొరబడ్డ దొంగ
- కణేకల్లు పోలీసులకు దొరికిన వైనం
- బాధితులకు కబురుపెట్టిన పోలీసులు

7

నేడు జేఎన్‌టీయూ స్నాతకోత్సవం



6

తిరకాసు

- బెడిసికొట్టిన బేరం..!
- ప్రైవేట్ ఆసుపత్రి కోసం కల్వర్టు
- చక్రంతిప్పిన పాలకవర్గంలోని ఓ కీలక నేత భర్త
- ముడుపుల బేరం... డాక్టర్‌తో ఒప్పందం
- రూ.73 లక్షలతో టెండరు పిలిచిన ఇంజనీర్లు
- మరో కీలక నేతకు పంపకాలు చేస్తానని ఒప్పందం
- సంతకం అయ్యాక ఇవ్వకపోవడంతో టెండర్‌కు బ్రేక్
- మల్లగుల్లాలు పడుతున్న నాయకుడు



భవనం ఎదుట మురుగు కాలువ

అనంతపురం క్రైం, మే 16(ఆంధ్రజ్యోతి): ఓ డాక్టరు ఈ మధ్యనే ఓ బిల్డింగ్ నిర్మించారు. ప్రధాన రహదారి నుంచి అక్కడికి వెళ్లడానికి ఓ కాలువ అడ్డంగా ఉంది. ఆ కాలువపై కల్వర్టు నిర్మిస్తే తన ఆసుపత్రికి డిమాండ్ ఉంటుందనేది ఆ వైద్యుడి ఆలోచన. దీన్ని ఓ వైసీపీ నేత క్యాష్ చేసుకున్నారు. కల్వర్టు కథ నేను చూస్తానని చెప్పి ఆ డాక్టరుతో బేరం కుదుర్చుకున్నారు. మరో కీలక నేత సంతకం అవసరం కావడంతో ఆయనతో లోపాయికారి ఒప్పందం చేసుకుని కొంత మొత్తం ముట్టజెబుతానన్నారు. ఇంజనీర్లు సైతం టెండరు పిలిచారు. సంతకం అయ్యాక మాట తప్పడంతో ఓ తిరకాసు పెట్టి ఆ కీలకనేత తన పదివి కున్న పవర్‌తో టెండర్‌కు బ్రేక్ వేశాడు. ఈ తతంగంపై ప్రస్తుతం నగరపాలికలో చర్చనీయాంశంగా మారింది.

ఆసుపత్రి కోసం కల్వర్టు

ఆయన నగరంలోని ఓ డాక్టరు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తి రోడ్డుకు వెళ్లే దారిలో రాజహంస గెస్ట్‌హౌస్ ఎదుట ఓ భవనం నిర్మించుకున్నారు. అందులో ఆసుపత్రి పెట్టాలనేది ఆయన ఆలోచన. అయితే ఆ ప్రధాన రహదారి నుంచి నేరుగా ఆసుపత్రికి దారి లేదు. మధ్యలో పెద్ద మురుగు కాలువ ఉంది. దానిపై పెద్ద కల్వర్టు నిర్మిస్తే దారి కలిసొస్తుందని ఆ డాక్టర్ భావించారు. ఏం చేయాలబ్బా అని ఆలోచిస్తున్న సమయంలో ఓ నేత షై హూనా అంటూ అండగా నిలిచాడు.

బేరం కుదుర్చుకుని...

ఆయన నగరపాలిక పాలకవర్గంలో ఓ కీలక నేత భర్త. దీర్ఘకాలంగా వైసీపీలోనే ఉన్నా, ప్రస్తుత అధికారపార్టీ నేతలతో ఈయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. దీంతో డాక్టర్ సమస్యను పరిష్కరిస్తానని ముందుకొచ్చారు. వీలైనంత త్వరగా కల్వర్టు నిర్మిస్తే ఆసుపత్రి ప్రారంభించుకుంటానని డాక్టర్ చెప్పారు. ఆ విషయం తనకు వదిలిపెట్టాలని వైసీపీ నాయకుడు బేరసారాలు మొదలు పెట్టాడు. ముందుగా రూ.2లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చి, అనంతరం రూ.10లక్షలు ఇచ్చేలా బేరం కుదుర్చుకున్నట్లు సమాచారం.

తిరకాసు లేఖతో టెండర్‌కు బ్రేక్

సంతకం చేసినా ముడుపులు రాకపోవడంతో ఆ కీలకనేతకు చిర్రెత్తుకొచ్చింది. ఏందయ్యా ఇది మాట మీద నిలబడటం రాదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు ఓ మెరుపు లాంటి ఐడియా వచ్చింది. ఓ కమ్యూనిస్టు పార్టీ నాయకుల నుంచి ఫిర్యాదు ఇప్పించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అదే అదనుగా కొందరు నాయకులు వచ్చి ఆ ప్రాంతంలో ఇల్లు లేవని, ఎలా కల్వర్టు నిర్మిస్తారని, ఇది ఎవరికి ఉపయోగమని..?కల్వర్టు నిర్మించకూడదంటూ కమిషనర్‌తో పాటు ఓ కీలకనేతకు వినతిపత్రాలు అందజేశారు. అంతే ఆ కీలక నేత మరో ఆలోచన చేయకుండా టెండర్‌ను ప్రస్తుతం తెరవొద్దంటూ ఆదేశాలిచ్చి నట్లు సమాచారం. అధికారపార్టీ నాయకులతో సంబంధాలున్న ఆ నాయకుడు ఎట్టి పరిస్థితుల్లోనైనా ఆ టెండర్ సంగతి చూడాలంటూ పట్టు పడుతున్నారట. మరి ఈయన ప్రయత్నం నెరవేరుతుందో..?లేక ఆ కీలక నేత పంతం నెగ్గించుకుంటారో వేచి చూడాల్సిందే. అటు డాక్టరేమో బిల్డింగ్ పర్మిషన్‌కు రూ.50లక్షల వరకు ఫీజు చెల్లించి, రూ.లక్ష వరకు పన్ను కట్టినా ఇదేంటబ్బా ఇలా జరిగిందని తెగ గింజుకుంటున్నారట. మొత్తానికి బేరం బెడిసి కొట్టి ఎంతపనైందంటూ ఈ విషయం తెలిసిన వారు చెవులు కొరుక్కుంటున్నారు.

మరి నాకేంటి ?

డాక్టర్‌కు కల్వర్టు కావాలి. నీకేమో పైసలు కావాలి. కానీ ఆ పని చేసేది నా డివిజన్‌లో మరి నా కేంటి? అంటూ ఓ కార్పొరేటర్ అడ్డు తగిలాడు. తనకు తెలియకుండా రూ.లక్షల్లో బేరాలు కుదుర్చుకుంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో ఆ నాయకుడు రూ.70వేలు ముట్టజెపిప ఈ కార్పొరేటర్ గొంతు పెంచకుండా చేసుకున్నాడు.

ఆ కీలక నేతతో ఒప్పందం

కల్వర్టు నిర్మించడమే ధ్యేయంగా పెట్టుకున్న నాయకుడు పాలకవర్గంలో కీలక నేతను కలుసుకున్నాడు. అధికార హోదా కలిగిన ఆ నేత విషయం తెలుసుకున్నారు. టెండరు పూర్తయితే 40శాతం ఇస్తానని చెప్పారు. ఇందుకు మీ సంతకం కావాల్సి ఉంటుందని చెప్పారు. పార్టీలో నాయకుడు, ముందు నుంచి పరిచయముంది కదా అని దర్జాగా సంతకం పెట్టారు. అలా ఫైల్ ముందుకు కదిలి టెండరుకు ఆదేశాలందాయి. నగరపాలిక ఇంజనీరింగ్ అధికారులు మొత్తం జీఎస్టీతో కలిపి ఎస్టిమేషన్(అంచనా) రూ.73 లక్షలతో టెండరు పిలిచారు. ఏప్రిల్ 17 నుంచి మే1వతేదీ వరకు 14 రోజుల పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించారు. ఆ మేరకు కొందరు కాంట్రాక్టర్లు టెండర్లు వేసినట్లు తెలిసింది. ఈ నాయకుడు ఇక్కడా కథ నడిపాడు. తనకు తెలిసిన కాంట్రాక్టర్‌తో టెండర్ వేయించినట్లు సమాచారం. అక్కడా గుడ్ విల్ లేదా కమీషన్ పొందాలనుకున్నాడు. కొన్ని రోజుల క్రితం టెండరు తెరవాల్సింది. ఇక్కడే కథ అడ్డం తిరిగింది.



ప్రైవేట్ ఆసుపత్రి కోసం కట్టిన భవనం

నారసింహుడి వైభవం

చూతము రారండి..

నేడు పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం



ఉరవకొండ, మే16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన బ్రహ్మ రథోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. రథాన్ని సిద్ధం చేశారు. బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ రమేష్‌బాబు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం స్నానాలు ఆచరించడానికి షవర్‌బాత్‌లు ఏర్పాటు చేశామన్నారు.

ధాన్యం కొనేదెవరు..?

- లక్ష్యం పూర్తయిందన్న అధికారులు

కణేకల్లు, మే 16(ఆంధ్రజ్యోతి): రైతు కష్టం చెల్లని కాసుగా మారింది. రబీ సీజన్‌లో రైతులు పండించిన వరిధాన్యాన్ని కొనేవారు కరువయ్యారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల లక్ష్యం పూర్తవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పంట నమోదు నుంచి ప్రభుత్వానికి ధాన్యాన్ని విక్రయించే వరకు అడుగడుగునా అన్నదాతకు ఇబ్బందులు తప్పట్లేదు. బోరుబావులు, కణేకల్లు చెరువు కింద రైతులు మండల వ్యాప్తంగా దాదాపు ఐదు వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. వ్యవసాయాధికారులు ఈ క్రాప్ నమోదు చేయకపోవడంతో రైతుకు సమస్యలు మొదలయ్యాయి. ఈ క్రాప్ కాకపోతే పంట కొనుగోలు చేయమని అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ క్రాప్ చేయించుకున్న కొద్ది మంది రైతులు ప్రభుత్వానికి ధాన్యాన్ని విక్రయించారు. క్షేత్రస్థాయికి వచ్చేసరికి ఏదో ఒక సమస్యతో రైతుల వరిధాన్యం ప్రభుత్వందాకా వెళ్లకుండా పోతోంది. తాజాగా ప్రభుత్వం నిర్దేశించిన కొనుగోలు లక్ష్యం పూర్తయిందన్న కారణంతో కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో దాదాపు 30 వరకు లారీలు ధాన్యం లోడు చేసుకుని రోడ్ల పక్కన వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రారంభంలో జిల్లా వ్యాప్తంగా 29 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 2,700 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసి ఆపేశారు. దీంతో ప్రభుత్వం మరలా అనుమతి ఇచ్చే వరకు ట్రక్ షీట్లను నమోదు చేయలేమని స్థానిక అధికారులు చెబుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

దడ పుట్టించే దారి..!



చింతలాయపల్లి-కుందనకోట ఘాట్‌రోడ్డులో వాహనదారులు చుట్టేయాల్సిన కొండ



ఘాట్ రోడ్డు పక్కన కిందకు జారిన మట్టి

యాడికి మండలంలోని చింతలాయపల్లి-కుందనకోట ఘాట్‌రోడ్‌లో ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. చింతలాయపల్లి నుంచి వెళ్లే ఈ ఘాట్‌రోడ్డు మీదుగా.. కుందనకోట, గుడిపాడు, నంద్యాల జిల్లా కౌలుపల్లె, బూరుగల, కంబగిరిస్వామి ఆలయం గ్రామాలకు చెందిన వాహనదారులు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ఈ ఘాట్‌రోడ్డు భూ ఉపరితలానికి సుమారు వెయ్యిమీటర్ల ఎత్తువరకు ఉంటుంది. కొండలను చుట్టువేసుకొని వెళ్లాలి. అంత ఎత్తు వరకు ఉన్న ఘాట్‌రోడ్డుకు వాహనదారుల భద్రత కోసం కనీసం సైడ్‌వాల్స్ కూడా లేకపోవడం గమనార్హం. ఎక్కడా హెచ్చరిక బోర్డులు లేవు. రోడ్డు పక్కన మట్టి అంతా కిందకు జారిపోయింది. ఎదురుగా వచ్చే వాహనాలు కంటికి కనిపించని మలుపులు ఉన్నాయి. వర్షాకాలంలో కొండచరియలు విరిగి పడుతుంటాయి. ఇంత ప్రమాదకరంగా ఉన్నా ఆయా గ్రామాల వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయక తప్పదు. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏళ్లు గడిచినా, ప్రభుత్వాలు మారినా తమకు నరక ప్రయాణం తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇటీవల చింతలాయపల్లి-కుందనకోట గ్రామాల మధ్య ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో పంప్‌స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. గ్రామాల సమీపంలోనే రెండు సిమెంట్ కర్మాగారాలు ఉన్నాయి. కనీసం సీఎస్ఆర్ నిధుల ద్వారా అయినా ఈ రోడ్డుకు ఇరువైపులా సైడ్ వాల్స్, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల వాహనదారులు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, యాడికి



సైడ్‌వాల్స్ లేని చింతలాయపల్లి-కుందనకోట ఘాట్‌రోడ్డు



దెబ్బతిన్న ఘాట్‌రోడ్డు సైడ్‌వాల్

ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ

పరిష్కరిస్తాం: మంత్రి నారా లోకేశ్



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న మహిళలు

గుత్తి, మే 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అనంతపురం రోడ్డులో రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వినతులు వెల్లువెత్తాయి. మండలంలోని ధర్మాపురం గ్రామానికి రోడ్డు గుంతలమయమైందనీ, కొత్తగా నిర్మించాలని మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చౌదరి కోరారు. గుంతకల్లు పట్టణానికి చెందిన గోరంట్ల నాగరాజు 2024లో రోడ్డు ప్రమాదంలో వెన్నెముక డిస్కులు విరిగి, శరీరం స్పర్శ లేకుండా పోయి, కాళ్లు, చేతులు పనిచేయక బెంగళూరులో రూ.18 లక్షలదాకా ఖర్చు చేశామన్నారు. అయినా నయం కాలేదనీ, వైద్యానికి, మందులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు నారా లోకేశ్ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్థికంగా ప్రభుత్వం సాయం చేయాలని కోరారు. సీఎం రిలీఫ్ ఫండ్ అందించాలని విన్నవించారు. వంశపారంపర్యంగా సక్రమించిన భూమిని కబ్జాదారులు ఆక్రమించారని, తనకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన రంగనాయకులు కోరారు. గుంతకల్లు మండలం నెలగొండ గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.16 లక్షలు స్వాహా చేశారని సింగాడి శ్రీనివాసులు.. మంత్రికి ఫిర్యాదు చేశాడు. పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, ఐటీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. గుంతకల్లు పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాలకు స్థలం కేటాయించి నూతన భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్.. మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ అమలు చేయాలనీ, సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలనీ, 9 రకాల పాఠశాలలను సవరించి పాత విద్యావిధానాన్ని అమలు చేయాలని ప్రతి పాఠశాలలో విద్యార్థులతో సంఖ్యతో సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలనీ, 12వ పీఆర్సీ కమిషన్ నియమించి, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని మంత్రిని కోరారు. అనేక మంది బాధితులు.. తమ సమస్యలపై మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. వాటిని స్వీకరించిన మంత్రి లోకేశ్ పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్







రెన్యూ ఇండియా స్టోరీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు లోకేశ్, గొట్టిపాటి రవి, సంస్థ చైర్మన్ సుమంత్ సిన్హా, కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే జయరాం, సభలో ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేశ్, హాజరైన ప్రజలు, టీడీపీ నాయకులు

ఉద్యోగ కల్పనే రెన్యూ లక్ష్యం

- సీఎం చంద్రబాబుపై నమ్మకంతో ఏపీ వైపు కంపెనీల చూపు
- స్థానికంగా పదివేల మందికి ఉద్యోగావకాశాలు
- సోలార్ విద్యుత్ ప్రాజెక్టుతో కరెంటు చార్జీలు తగ్గిస్తాం
- 'రెన్యూ' ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్

గుంతకల్లు, మే16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ కల్పనే లక్ష్యంగా రెన్యూ హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టును తెచ్చామని విద్య, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. గుత్తి మండలం బేతాపల్లి వద్ద సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు మంత్రి శనివారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సు లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా ఉన్న 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగానే ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ సోలార్ విద్యుత్ ప్రాజెక్టులో రెన్యూ విద్యుత్ కంపెనీ రూ. 22,000 కోట్లు పెట్టుబడి పెడుతోందన్నారు. దీంతో అనంతపురం జిల్లాలో 10 వేల ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడిపై నమ్మకంతో ఇప్పుడిప్పుడే భారీ కంపెనీలు ఏపీ వైపు వస్తున్నాయన్నారు. గడచిన ఐదేళ్లలో ఒక్క మెగావాట్ విద్యుదుత్పత్తి సంస్థ, ఒక్క బ్యాటరీ స్టోరేజి సిస్టం వ్యవస్థ కూడా రాలేదన్నారు. ఇటువంటి పవర్ ప్రాజెక్టుల ద్వారా గత ప్రభుత్వ హయాంలో ప్రజలపై పడిన విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని రానున్న రోజుల్లో తగ్గిస్తామన్నారు. ఏపీలో ఉత్పత్తి చేయనున్న విద్యుత్ రానున్న రోజుల్లో యావత్ భారత దేశానికి ఉపయోగపడుతుందన్నారు. విజన్ ఉన్న నేత ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో హైబ్రిడ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టులాంటివి మరిన్ని రాష్ట్రానికి తెస్తామన్నారు. ప్రధాని కారణంగానే రాయలసీమకు పవర్ ప్రాజెక్టు వచ్చిందని, త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీని రాయలసీమ గడ్డపైకి కూడా రప్పిస్తామన్నారు. గడచిన ఐదేళ్లలో రోడ్లు కాదు, రోడ్లపై పడిన గుంతలను కూడా పూడ్చలేకపోయారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే తాము అన్ని మార్గాలను అన్వేషించి పెట్టుబడులను తేవడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రాజెక్టుకు వ్యవసాయ భూములను ఇచ్చిన రైతులకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్ బాబు, లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, రాయల్ రామయ్య, వీరేశ్, చిప్పగిరి ప్రతాప్, పెంచలపాడు వెంకటేశులు పాల్గొన్నారు.



ఎక్స్‌కవేటరుతో పవర్ ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తున్న లోకేశ్

వెళ్లిపోయిన పెట్టుబడులు వెనక్కు వస్తున్నాయి

విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్



గత ఐదేళ్లలో వెనక్కు వెళ్లిపోయిన పెట్టుడిదారులందరూ తిరిగి ఏపీకి వస్తున్నారని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ ప్రాజెక్టు శంకుస్థాపనా సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్లే కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయన్నారు. రాయలసీమకు చెందిన జగన్ ఇక్కడి ప్రజలకు చేసిన మేలు ఒక్కటీ లేదన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన 11 నెలల్లోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నో కంపెనీలను రాష్ట్రానికి తెచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు.

రైతులు, యువతకు మేలు: ఎమ్మెల్యే గుమ్మనూరు



రెన్యూ సోలార్ విద్యుత్ ప్రాజెక్టు వల్ల స్థానిక యువత, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. బేతాపల్లి వద్ద ఏర్పాటుచేసిన హైబ్రిడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు శంకుస్థాపనా సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ ప్రాంతంలో మెట్ట భూములలో పంటలు పండితే ఎకరాకు రూ. 20 వేల నుంచి రూ. 25 వేలదాకా మాత్రమే రైతులకు మిగులుతోందన్నారు. అటువంటిది రెన్యూ విద్యుత్ కంపెనీ రైతులకు ఎకరాకు రూ.35 వేల లీజు చెల్లించడానికి ముందుకు వచ్చిందంటే అది అదృష్టమనే చెప్పాలన్నారు. ఈ ప్రాజెక్టు స్థాపన వల్ల స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

పవన, సోలార్ విద్యుదుత్పాదనకు ఏపీ అనుకూలం: సుమంత్ సిన్హా



పవన, సోలార్ విద్యుదుత్పాదనకు రాష్ట్రంలో అనువైన ప్రదేశాలు ఉన్నందుకే తాము ఇక్కడ ప్రాజెక్టును నిర్మించడానికి ముందుకు వచ్చామని రెన్యూ విద్యుత్ కంపెనీ చైర్మన్, సీఈఓ సుమంత్ సిన్హా పేర్కొన్నారు. ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెట్టుబడులకు ఏపీ అనుకూలమైన విధానాలను అనుసరిస్తోందని తెలిపారు. ట్రాన్స్‌మిషన్ కనెక్టివిటీ ఇక్కడ మెండుగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు చొరవ కారణంగానే తాము ఏపీ పట్ల సానుకూల దృక్పథంతో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చినట్లు తెలియజేశారు. 78.5 గిగావాట్ల సౌర విద్యుత్తు, 35 గిగా వాట్ల పవన విద్యుత్తు, 25 గిగా వాట్ అవర్ బ్యాటరీ శక్తి నిల్వను ఉత్పత్తి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రాజెక్టు నిర్మాణం చేయనున్నట్లు వివరించారు.



మంత్రి లోకేశ్‌తో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు..



లోకేశ్‌తో ముచ్చటిస్తున్న మంత్రి సవిత

పెళ్లిలో సందడి

అనంతపురం, మే16(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కూతురు శ్రీచరిత, ఆయన వియ్యంకుడు ముత్తినేని రాజగోపాల్ కుమారుడు రాహుల్ ఆదిత్య వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతపురం నగర శివారులో జరిగిన వివాహ వేడుకలకు బంధుమిత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రముఖులు, జిల్లా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు, టీడీపీ శ్రేణులు తరలివచ్చారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, శాసన సభ సభాపతి అయ్యన్నపాత్రుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, సవిత, అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ హాజరై.. నూతన దంపతులను ఆశీర్వదించారు. మాజీ మంత్రులు కామినేని శ్రీనివాసరావు, అమరనాథ రెడ్డి, పల్లె రఘునాథ రెడ్డి, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, ఎంఎస్ రాజు, గుమ్మనూరు జయరాం, కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, టీడీపీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, ముఖ్యనేతలు ఎద్దుల సుబ్రహ్మణ్యం, తలారి ఆదినారాయణ, గౌస్‌మొహిద్దీన్, స్వరూప తదితరులు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



నూతన దంపతులు, వారి కుటుంబ సభ్యులతో మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే గుమ్మనూరు, ఎంపీ బీకే



విద్యుద్దీప వెలుగుల్లో ఎన్టీఆర్ ఆడిటోరియం



ఆడిటోరియం లోపల ఏర్పాట్లు



స్నాతకోత్సవ రిహార్సల్స్

నేడే పట్టాల పండుగ

జేఎన్‌టీయూ స్నాతకోత్సవానికి సర్వం సిద్ధం

ముస్తాబైన ఎన్టీఆర్ ఆడిటోరియం

హాజరుకానున్న గవర్నర్

అనంతపురం సెంట్రల్, మే 16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ 14వ స్నాతకోత్సవం శనివారం అట్టహాసంగా నిర్వహించనున్నారు. వేడుకలకు వర్సిటీ చాన్సిలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. స్నాతకోత్సవంలో విద్యార్థులకు బంగారు పతకాలు, పట్టాలను గవర్నర్ ప్రదానం చేస్తారు. వీసీ సుదర్శనరావు, వర్సిటీ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమర్ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ, వైద్య శాఖల అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. స్నాతకోత్సవానికి వేదికైన ఎన్టీఆర్ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం కాన్వకేషన్ రిహార్సల్స్ నిర్వహించారు. శనివారం ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభంకానున్నాయి.

40,109 మందికి పట్టాలు

జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవంలో 40,109 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయనున్నట్లు వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, అకడమిక్, ఆడిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్‌తో కలిసి వీసీ వివరాలు వెల్లడించారు. బీటెక్, బీఫార్మసీ పూర్తిచేసిన 30,017 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను అందజేస్తామన్నారు.

ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ పూర్తిచేసిన 9,564 మందికి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు, 361 మందికి ఫార్మా-డి పట్టాలను అందజేస్తామన్నారు. 167 మందికి పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేస్తామన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో కోర్సులు పూర్తి చేసి ప్రతిభ కనబరచిన డిగ్రీ విద్యార్థులకు 40, పీజీ విద్యార్థికి ఒకటి మొత్తం 41 గోల్డ్ మెడల్స్ అందజేస్తామన్నారు. అనంతపురం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి ఆరు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థిని సుప్రజ నాలుగు గోల్డ్‌మెడల్స్‌కు ఎంపికయ్యారన్నారు.

వర్సిటీ ముస్తాబు..

స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ హాజరవుతుండడంతో జేఎన్‌టీయూ పరిసరాలు ముస్తాబయ్యాయి. కలెక్టరేట్ వద్దనున్న వైజంక్షన్ రోడ్డు నుంచి జేఎన్‌టీయూ ప్రాంగణం వరకు చిన్మయ గ్రామ పంచాయతీ, నగరపాలక సంస్థ కార్మికులు శుభ్రంచేశారు. వైద్యసిబ్బంది మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పాట్లను చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో పదుల సంఖ్యలో పోలీసుసిబ్బంది భద్రత కల్పించనున్నారు. గవర్నర్‌కు స్వాగత ఏర్పాట్లు, సేదతీరేందుకు గెస్ట్ హౌస్ తదితర ప్రక్రియలను డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, రూరల్ మండల తహసీల్దార్ మోహన్‌కుమార్ పర్యవేక్షించారు.

ప్రధానిని కలిసేందుకు మంత్రి..

జేఎన్టీయూ స్నాతకోత్సవానికి గవర్నర్‌తోపాటు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యునికేషన్స్, రియల్-టైమ్ గవర్నెన్స్ మంత్రి నారా లోకేశ్ పాల్గొనేందుకు జిల్లా యంత్రాంగం షెడ్యూల్‌ను ఖరారుచేసింది. దేశ ప్రధాని నరేంద్ర మోదీని కలిసేందుకు మంత్రి లోకేశ్‌కు అపాయింట్‌మెంట్ సమాచారం అందడంతో.. ఆయన ఢిల్లీకి పయనమై వెళ్లారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

స్నాతకోత్సవం సాగేదిలా..

- ఉదయం 10 నుంచి 10.15 గంటల వరకు జేఎన్‌టీయూ వీసీ, పాలకమండలి సభ్యులు, రిజిస్ట్రార్, ప్రిన్సిపాళ్లు స్నాతకోత్సవ వేదిక వద్దకు చేరుకుని, అకడమిక్ రోబ్స్‌ను ధరిస్తారు.
- 10.25 నుంచి 10.48 గంటల వరకు గౌరవ డాక్టరేట్ గ్రహీత, ముఖ్య అతిథులతోపాటు చాన్సిలర్ అయిన రాష్ట్ర గవర్నర్‌కు వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు స్వాగతం పలుకుతారు. అనంతరం వారు అకడమిక్ రోబ్స్‌ను ధరిస్తారు.
- 10.50 నుంచి 10.57 వరకు గ్రూప్ ఫొటో దిగి, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను ఊరేగింపుగా వేదికపైకి తీసుకెళ్లి, జాతీయ గీతాన్ని ఆలపిస్తారు.
- 10.59 నుంచి 11.10 గంటల వరకు రాష్ట్ర గవర్నర్ స్నాతకోత్సవాన్ని ప్రారంభిస్తారు. అనంతరం వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు స్వాగత ప్రసంగంచేసి, జేఎన్‌టీయూ అభివృద్ధి నివేదికలను సమర్పిస్తారు.
- 11.10 నుంచి 11.15 గంటల వరకు గౌరవ డాక్టరేట్‌కు ఎంపికైన డాక్టర్ సత్యనారాయణ ప్రసంగిస్తారు. అనంతరం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తారు.
- 11.15 నుంచి 11.30 గంటల వరకు విద్యార్థులకు బంగారు పతకాలు, డిగ్రీలను గవర్నర్ ప్రదానం చేస్తారు.
- 11.50 గంటల వరకు స్నాతకోత్సవ ముఖ్య అతిథిగా ఐఐటీ కాన్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్ ప్రసంగిస్తారు.
- 12.05 గంటల వరకు చాన్సిలర్ హోదాలో గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారు. అనంతరం గవర్నర్‌కు జ్ఞాపిక అందజేసి, సత్కరిస్తారు.
- 12.13 గంటల వరకు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య ధన్యవాద తీర్మానం చేస్తారు. అనంతరం స్నాతకోత్సవ ముగింపునకు చాన్సిలర్ అబ్దుల్ నజీర్ అనుమతికోరుతూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ప్రసంగం చేస్తారు.
- 12.15 గంటల వరకు స్నాతకోత్సవానికి హాజరైన వారందరూ జాతీయ గీతాన్ని ఆలపిస్తారు.
- 12.15 గంటలకు గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ వేడుకల నుంచి నిష్క్రమిస్తారు.

పోలీసులు అలర్ట్..

ఎంపీపీ ఎన్నిక నేపథ్యం

గ్రామాల్లో విస్తృత తనిఖీలు



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ శ్రీధర్

రామగిరి, మే 16(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మండలంలో ఊరూరా కలియతిరుగుతూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 19వ తేదీన రామగిరి ఎంపీపీ ఎన్నిక నిర్వహించనుండడంతో పోలీసులు గ్రామాల్లో విస్తృత పర్యవేక్షణ చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గురువారం రాత్రి సీఐ శ్రీధర్ పేరూరు, కొత్తపల్లి, గంగంపల్లి తదితర గ్రామాల్లో విస్తృతంగా తిరిగారు. కొత్తపల్లిలో ఎంపీటీసీ-2 ఇంటికి తాళాలు వేసి ఉండటంతో గ్రామంలో ఆయన కలియతిరిగారు. అక్కడ వైసీపీకి చెందిన ఓ నాయకుడికి బెదిరింపులు వచ్చాయని తెలియడంతో ఆయనను కూడా విచారించారు. గ్రామస్థులతో సమావేశం ఏర్పాటుచేసి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని తెలిపారు. ఏ చిన్న సమస్య ఉన్నా.. గొడవ జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో రెచ్చగొట్టేలా ప్రవర్తించవద్దనీ, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసీపీ ఎంపీటీసీలున్న గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచారు.

క్రైం కార్నర్

బాబాయ్.. అబ్బాయ్.. చోరీలు

- ఆలయాలే లక్ష్యం..
- పోలీసులకు చిక్కిన నిందితులు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ వంశీకృష్ణ

కళ్యాణదుర్గం, మే 16(ఆంధ్రజ్యోతి): బాబాయ్.., అబ్బాయ్.. వ్యసనాల బారిన పడ్డారు. వాటిని తీర్చుకునేందుకు డబ్బు కోసం చోరీల బాట పట్టారు. అదికూడా ఆలయాలనే లక్ష్యంగా చేసుకున్నారు. పలు ఆలయాల్లో చోరీలు చేశారు. ఆఖరుకు పోలీసులకు చిక్కి, కటకటాల పాలయ్యారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి తులం బంగారం, 4.50 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం సీఐ వంశీకృష్ణ. దొంగల అరెస్టు వివరాలను వెల్లడించారు. ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన ఆవుల రాజశేఖర్, అతడి చిన్నాన్న గొల్ల బొబ్బిలి వ్యసనాలకు బానిసలయ్యారు. వాటిని తీర్చుకునేందుకు చోరీలను ఎంచుకున్నారు. ఆలయాలే లక్ష్యంగా చోరీ లు మొదలెట్టారు. కళ్యాణదుర్గం మండలంలోని మల్లిపల్లి చౌడేశ్వరి, బోయలపల్లిలో మారెమ్మ, కంబదూరు మండల పరిధి కదిరిదేవరపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి, తిమ్మాపురం వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాల్లో చోరీకి పా ల్పడ్డారు. ఆలయాల తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించేవారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసేవారు. హుండీలను కూడా పగులకొట్టి అందులోని నగ దు, బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. చోరీలపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. శుక్రవారం రాజశేఖర్, గొల్ల బొబ్బిలిని అరెస్టు చేసి, ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

బొలెరో వాహనం బోల్తా

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

తాడిపత్రి, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇగుడూరు గ్రామ సమీపంలో శుక్రవారం బొలెరో వాహనం బోల్తాపడిన సంఘటనలో చాంద్ బాషా (40) మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడ్డారని ఎస్ఐ కాటయ్య తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన చాంద్‌బాషా, హుస్సేన్‌బాషా, యర్రగుంట్లకు చెందిన ఆంజనేయులు, గంగ్రప్రతాప్ జీవాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈక్రమంలోనే బళ్లారిజిల్లా హోస్పేట్ సమీపంలోని కుంకుమపల్లె వద్ద 40పొట్టేళ్లను తీసుకొని ప్రొద్దుటూరుకు బయలుదేరారు. ఇగుడూరు సమీపంలోకి రాగానే టైరుపగిలి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో చాంద్‌బాషా అక్కడికక్కడే మృతిచెందాడు. ఆంజనేయులు, హుస్సేన్ బాషా, గంగ్రప్రతాప్ స్వల్పంగా గాయపడ్డారు. వారిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య షేక్ రియాజీ, ఒక కుమారుడు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ కాటయ్య సిబ్బందితో కలిసి పరిశీలించారు.

లారీని ఢీకొట్టిన ఐచర్.. డ్రైవర్ మృతి

పెద్దవడుగూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తిఅనంతపురం గ్రామ సమీపంలోని ఎన్‌హెచ్-44 జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని శుక్రవారం తెల్లవారుజామున ఐచర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హర్యానా రాష్ట్రంలోని మేవాత్ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ ఇమ్రాన్ (38)మృతి చెందాడు. హర్యానాకు చెందిన లారీ బెంగళూరుకు వెళుతుండగా బ్రేక్ డౌన్ అవడంతో రోడ్డు పక్కన ఆపారు. దాన్ని తమిళనాడుకు చెందిన ఐచర్ వెనుకవైపు నుంచి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన లారీ డ్రైవర్ ఇమ్రాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు...

తాడిపత్రి, మే 16(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు ఓబయ్య(35) మృతి చెందిన సంఘటన శుక్రవారం పట్టణంలో జరిగినట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహనాయుడు తెలిపారు. శ్రీనివాసపురానికి చెందిన ఓబయ్య భవన నిర్మాణంలో కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. అందులో భాగంగా కాల్వగడ్డ వీధిలో నిర్మిస్తున్న భవనానికి సంబంధించి కడ్డీలను కట్ చేసి పైకి ఎత్తి తీసుకువెళుతున్న సమయంలో విద్యుత్ లైనుకు కడ్డీలు తగిలాయి. దీంతో విద్యుత్ సరఫరా అయి ఓబయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య నాగేశ్వరితోపాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆటో బోల్తా - ఒకరి మృతి

పామిడి, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామరాజుపల్లి సమీపాన 44వ జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడి శైలు(15) మృతి చెందగా మరో నలుగురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్యాపిలి పట్టణానికి చెందిన నాగేంద్ర, రాధమ్మ దంపతులు తమ పిల్లలు శైలు, మోక్షిత, సుదర్శన్‌తో కలిసి ఆటోలో ఉరవకొండ మండలం పెన్నఅహోబిళం దేవస్థానానికి బయలుదేరారు. రామరాజుపల్లి సమీపంలో అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మోస్తరు వర్షం

పుట్టపర్తి రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం రాత్రి ఓమోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా గుడిబండ 35.2 మి.మీ వర్షం కురవగా, అత్యల్పంగా అగళిలో 5.2 మిమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. గాండ్లపెంట 20.0 మి.మీ, రొళ్ల 21.2 మి.మీ, మడకశిర 6.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో చీనీ ధర మరింత పెరిగింది. చీనీకాయలు టన్ను గరిష్ఠంగా శుక్రవారం రూ. 35,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.6,200, సరాసరి రూ.22వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 545 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఏపీలో అభివృద్ధి పరుగులు

- నిధులు ఇస్తున్నాం.. అభివృద్ధి బాధ్యత మీదే
- రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న
- అనంత స్టేషన్ తనిఖీ



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రైల్వే సహాయ మంత్రి సోమన్న

అనంతపురం న్యూటౌన్ మే 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ పరుగులు పెడుతోందని రైల్వే సహాయమంత్రి సోమన్న పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి శుక్రవారం వచ్చిన ఆయన స్థానిక ఎంపీ అంబిక లక్ష్మీనారాయణతో కలిసి స్థానిక రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. రైల్వే స్టేషన్‌కు వచ్చిన వారికి స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కావల్సినన్ని నిధులు కేటాయిస్తున్నాం. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సిన బాధ్యత మీదేనని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాకు సూచించారు. అనంతరం వీఐపీ విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు విషయాలను ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో 73 రైల్వే స్టేషన్లలో అమృత్ పథకం కింద పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రాజమండ్రి, తిరుపతి, విశాఖపట్నం రైల్వే స్టేషన్ల అభివృద్ధికి వందల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతపురం రైల్వే స్టేషన్‌ను సైతం రూ.30 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఎస్కలేటర్ సౌకర్యం కలిగిన ఈ స్టేషన్‌ను 2026లోపు పూర్తి చేస్తామన్నారు.

మంత్రి సహకారంతోనే బెంగళూరుకు రైలు: ఎంపీ

మంత్రి సహకారంతోనే అనంతపురం నుంచి బెంగళూరుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయగలిగామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి మరిన్ని రైలు సర్వీసులు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. ఢిల్లీకి వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను అనంతపురం స్టేషన్‌లో ఆపేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లే రైలును రాయలచెరువులో ఆపేలా చూడాలని కోరారు.

మరిన్ని నిధులు కేటాయించండి: ఎమ్మెల్యే

అనంతపురం రైల్వే స్టేషన్‌లో మరిన్ని సదుపాయాలు కల్పించేలా చూడాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కేంద్ర మంత్రిని కోరారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కోచ్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సందిండి శ్రీనివాసులు, డీఎస్‌సీ మురళీకృష్ణ, ఏఎస్‌సీ అనిల్‌కుమార్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఓఎం శ్రావన్, సీనియర్ డీఈఎన్ శ్రీనివాసులు, డీఈ ఎల్లయ్య, స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్, హెల్త్‌ఇన్‌స్పెక్టర్ మూర్తి, సీఐ సుధాకర్‌తో పాటు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లింటికి చల్లటి కబురు..!

- కూతురు పెళ్లికి దాచిన బంగారం చోరీ
- కువైట్‌లో 20 ఏళ్లు కష్టపడి సంపాదించిన తండ్రి
- గత నెల 30న రాయచోటిలోని ఇంట్లో చొరబడ్డ దొంగ
- కణేకల్లు పోలీసులకు దొరికిన వైనం
- బాధితులకు కబురుపెట్టిన పోలీసులు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

అనంతపురం క్రైం/రాయదుర్గం, మే 16(ఆంధ్రజ్యోతి): కుటుంబం కోసం అతను కువైట్ వెళ్లాడు. భార్య, పిల్లలకు దూరంగా 20 ఏళ్లకు పైగా గడిపాడు. కొవిడ్ సమయంలో భార్య, కొడుకు మృతిచెందారు. దీంతో అతను స్వదేశానికి తిరిగొచ్చాడు. తనకంటూ మిగిలిన ఒక్కగానొక్క కూతురు వివాహానికి ఏర్పాట్లు చేస్తున్నాడు. అప్పటి వరకూ కష్టపడి సంపాదించిన సొమ్ముతో కొన్న బంగారాన్ని తాకట్టు నుంచి విడిపించాడు. ఇంకో నెలలో పెళ్లి జరగాల్సి ఉండగా.. ఇంట్లో దొంగపడి బంగారాన్ని దోచుకుపోయాడు. దీంతో ఆ తండ్రి హతాశుడయ్యాడు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ తండ్రికి పోలీసులు చల్లటి కబురు అందించారు. 'ఒక దొంగను పట్టుకున్నాం. రికవరీ చేసిన బంగారంలో మీరు పోగొట్టుకున్నదీ ఉంది.' అన్నారు. అంతే.. ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

ఇంతకూ ఏమిటా కథ..?

అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన విజయ్ భాస్కర్, క్రిష్ణవేణి దంపతులకు సాయి ప్రతాప్ నాయుడు, ప్రీతి సంతానం. ఆర్థిక ఇబ్బందుల కారణంగా 20 ఏళ్ల క్రితం విజయ్ భాస్కర్ కువైట్‌కు వెళ్లారు. అక్కడ రేయింబవళ్లు కష్టపడి సంపాదించిన సొమ్మును ప్రతి నెలా కుటుంబ సభ్యులకు డబ్బు పంపేవాడు. కొవిడ్ సమయంలో, 2021లో భార్య క్రిష్ణవేణి, కుమారుడు ప్రతాప్ మృతి చెందారు. దీంతో విజయ్‌భాస్కర్ రాయచోటికి తిరిగి వచ్చారు. కూతురుకు పెళ్లి కుదరడంతో బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను రెండు నెలల క్రితం ఇంటికి తీసుకొచ్చారు. మరో నెల రోజుల్లో పెళ్లి ఉండటంతో ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో గత నెల 30న విజయ భాస్కర్‌కు కంటి వైద్యం చేయించేందుకు కూతురు ప్రీతి వైద్యుడి వద్దకు తీసుకెళ్లింది. వారు తిరిగి వచ్చేలోగా ఇంట్లో చోరీ జరిగింది. మొత్తం 31 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకుపోయారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా కణేకల్లు పోలీసులు పీట్ల గంగాధర్ అలియాస్ సాంబ అనే అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేశారు. అతన్నుంచి 45.5 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అందులో విజయ్ భాస్కర్ ఇంట్లో చోరీ చేసిన 31 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఈ విషయాన్ని పోలీసులు బాధిత కుటుంబానికి తెలియజేశారు. ఆ కుటుంబం ఆనందంలో మునిగిపోయింది.

సామాన్యుడు కాదు..

పీట్ల గంగాధర్ వివిధ రాష్ట్రాల్లో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేశాడని కణేకల్లు సీఐ వెంకటరమణ తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐలు నాగమధు, నబీరసూల్‌తో కలిసి ఆయన ఈ కేసు వివరాలను తెలిపారు. కణేకల్లు క్రాస్ వద్ద అతన్ని శుక్రవారం అరెస్టు చేసి, రూ.48 లక్షల విలువచేసే 45.5 తులాల బంగారు నగలు, 2.27 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన పీట్ల గంగాధర్, క్రికెట్ బెట్టింగ్, జూదానికి బానిసయ్యాడు. జల్సాలకు అలవాటు పడ్డాడు. డబ్బులకోసం చోరీలు చేసేవాడు. రాయదుర్గం, రాప్తాడు, గోరంట్ల, గాండ్లపెంట, బ్రహ్మసముద్రం, అనంతపురం, ఉరవకొండ, విడపనకల్లు, డోన్, పులివెందుల, రాయచోటి, తెలంగాణలోని వికారాబాద్, కొత్తకోట, ఆమనగల్లు, షాద్‌నగర్, కర్ణాటకలోని జగలూరు, బళ్లారి ప్రాంతాల్లో ఇతడిపై చోరీ కేసులు ఉన్నాయి. మొత్తం 40 కేసుల్లో నిందితుడు. కణేకల్లు క్రాస్‌లో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేస్తుండగా.. గంగాధర్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని విచారించగా అంతర్రాష్ట్ర దొంగ అని తేలింది.

మీ ఊరికొస్తా... మీ ఇంటికైనా వస్తా

- హంద్రీనీవాపై బహిరంగ చర్చకు సిద్ధం
- వైసీపీ నేత శివరామిరెడ్డికి ప్రభుత్వ విప్ కాలవ సవాల్

అనంతపురం అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉరవకొండలోనే కాదు, మీ స్వగ్రామం కొనకొండ్ల లేదా... మీ స్వగృహంలోనైనా సరే హంద్రీనీవాపై బహిరంగ చర్చకు వస్తానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వైసీపీ నేత, ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి సవాల్ విసిరారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీలతో కలిసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం హయాంలోనే హంద్రీనీవా పనులు వేగవంతంగా జరిగాయన్నారు. సీఎం చంద్రబాబు పాలనలో సీమలో సాగునీటి ప్రాజెక్టుల పనులు తిరిగి ప్రారంభమ వుతున్నాయన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హంద్రీనీవా ప్రాజెక్టు పనులను పూర్తిగా తొక్కిపెట్టి, సీమ సాగునీటి రంగాన్ని సర్వనాశనం చేశారన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులుగా మాజీ సీఎం జగన్‌ను అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. సీఎం చంద్రబాబు చేస్తున్న మంచి పనులను మెచ్చుకోవాలన్న మనసు మీకులేకుంటే మౌనంగా ఉండాలని, అలాకాకుండా ఇష్టానుసారంగా మాట్లాడటం పద్ధతి కాదన్నారు. ఉత్తుత్తి ఉత్తర్వులతో ప్రజలను మోసం చేసినా నోరుమెదపని వైసీపీ నేతలు అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, శివరామిరెడ్డిలు ప్రస్తుతం సీఎం చంద్రబాబు హంద్రీనీవా పనులను పునఃప్రారంభించి, పరుగులు పెట్టిస్తుంటే విమర్శలు చేయడం శోచనీయమన్నారు. వారి విమర్శలకు సమాధానం ఇవ్వడానికి బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. శివరామిరెడ్డి ఉరవకొండలో చర్చకు రావాలని సవాల్ విసిరారని, ఆయన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నాన్నారు. అలాకాకుంటే ఈనెల 21, 22వతేదీల్లో ఉదయం 11 గంటలకు అనంతపురం ప్రెస్ క్లబ్‌లో తాను సిద్ధంగా ఉంటానని, నీవుగానీ, నీ తరఫున ఇతర నాయకులను ఎవరిని పంపించినా బహిరంగ చర్చకు తాను సిద్ధమేనని సవాల్ విసిరారు.



మీడియాతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ఘనంగా ఎమ్మెల్యే అశ్మిత్ పుట్టినరోజు



ఎమ్మెల్యేకు గజమాల వేస్తున్న నాయకులు, కార్యకర్తలు

తాడిపత్రి, మే16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన నివాసం వద్దకు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకుని, శుభాకాంక్షలు తెలిపారు. గజమాలతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. అందరినీ ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేకి టీడీపీ సీనియర్ నాయకుడు, ఆయన సోదరుడు జేసీ పవన్‌రెడ్డి ప్రేమతో ఆలింగనం చేసుకుని, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు జగన్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

పైపులైన్ ప్రారంభం

పెన్నానది నుంచి నెహ్రూ పార్కు వరకు ఏర్పాటు చేసిన పైపులైన్‌ను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పైపులైన్‌తో పోరాటకాలనీ, సీపీఐ కాలనీ, ఓంశాంతినగర్, బంకమడివీధి, సుంకులమ్మపాలెం తదితర ప్రాంతాల్లో నీటికొరత ఉండదన్నారు. అంతకుమునుపు ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం కొళాయి తిప్పి, నీటి సరఫరాను ప్రారంభించారు. ట్యాంక్ వద్ద మొక్కలు నాటారు. కాలనీవాసులకు విందు ఏర్పాటు చేశారు.



పైపులైన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉపాధ్యాయుల ఉద్యమబాట...!

- 21న డీఈఓ ఆఫీస్ ముట్టడి
- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక

అనంతపురం విద్య, మే 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 21న డీఈఓ ఆఫీస్ ముట్టడికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు నిచ్చింది. రికగ్నైజ్డ్, రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలన్నీ ఐక్యవేదికగా ఏర్పడి, సమస్యల పరిష్కారానికి పోరాటం చేసేందుకు సిద్ధమయ్యాయి. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం 117 జీవో రద్దు చేసి... ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. ఇటీవల స్కూళ్ల పునర్నిర్మాణం, ఉపాధ్యాయ పోస్టుల పునర్విభజనకు నాంది పలికింది. ఇందులో భాగంగా ఇటీవల విద్యాశాఖ జీవోలు 19, 20, 21 విడుదల చేసింది. వీటిపై మెజార్టీ ఉపాధ్యాయులు, సంఘాల నేతలు అసంతృప్తిలో ఉన్నారు. సంఘాల నేతలిచ్చిన ప్రతిపాదనలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, అధికారులు అనుకున్నదే చేస్తూ ముందుకెళ్తున్నారన్న అసంతృప్తిలో సంఘాల నాయకులు ఉన్నారు. మంత్రి లోకేశ్ విద్యాశాఖలో సంస్కరణలు తేవాలన్న యోచనతో ఉంటే, రాష్ట్ర స్థాయిలో కొందరు అధికారులు మాత్రం స్కూళ్లపై వింత ప్రయోగాలు చేస్తూ, విపరీత ధోరణిలో ముందుకెళ్తున్నారన్న విమర్శలు సంఘాల నేతల నుంచీ వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం స్కూళ్లను 6 రకాలుగా మారిస్తే...ఈ ప్రభుత్వం 9 రకాలుగా మార్చిందంటూ ఉపాధ్యాయులు, నేతలు మండిపడుతున్నారు. ఈనేపథ్యంలోనే విజయవాడలో శుక్రవారం జరగాల్సిన ఉపాధ్యాయ సంఘాల సమావేశాన్ని కూడా ఇప్పటికే బహిష్కరించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 21న ఉమ్మడి జిల్లాల డీఈఓ ఆఫీస్‌ల ముట్టడికి పిలుపునిచ్చినట్లు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

- మంత్రి లోకేశ్‌కు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు వినతి



మంత్రి లోకేశ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వెంకటశివుడు యాదవ్, పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, మే 16(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు కోరారు. ఈమేరకు శుక్రవారం అనంతపురానికి వచ్చిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పూల నాగరాజు మాట్లాడుతూ... ఆర్టీసీ ఉద్యోగులను చిన్న చిన్న కారణాలకే సస్పెండ్ చేయడంతో పాటు విధుల నుంచి తొలగిస్తున్నారన్నారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి, ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకులతో కలిసి నారా లోకేశ్‌కు జ్ఞాపికను అందజేసి, సత్కరించారు.

ఉద్యోగార్థులకు ఎస్కేయూలో వసతి

అనంతపురం సెంట్రల్, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం కోసం పరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యార్థులకు ఎస్కేయూలో ప్రత్యేకంగా వసతిని కల్పించినట్లు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఈనెల 15నుంచి జూలై 10వరకు వర్సిటీ వేసవి సెలవులను ప్రకటించి హాస్టల్స్‌ను మూసివేసిందన్నారు. దీంతో తమ ప్రిపరేషన్‌కు ఇబ్బంది అవుతుందని డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాల పరీక్షలకు చదువుతున్న విద్యార్థులు వీసీని కలిసి విన్నవించారు. భువన విజయం ఆడిటోరియం భవనంలో గదులను కేటాయించి చదుకునేందుకు ఆటంకంలేకుండా వసతి కల్పించినట్లు వీసీ వెల్లడించారు.

43 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం: డీసీహెచ్ఎస్

అనంతపురం టౌన్, మే16 (ఆంధ్రజ్యోతి): వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్ శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 43పోస్టులు భర్తీ చేయడానికి కలెక్టరు ఆమోదం తెలిపారన్నారు. ఇందులో రేడియోగ్రాఫర్-2, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులు04, ఆపరేషన్ థియేటర్02, రికార్డు అసిస్టెంట్ 02, ఆఫీస్ సబార్డినేట్-03, పోస్టుమార్టమ్ అసిస్టెంట్ 02, జనరల్ డ్యూటీ అటెండెంట్స్ 22, బయోమెడికల్ ఇంజనీర్, ఆడియో మెట్రిక్ టెక్నీషియన్, ఫిజియోథెరపిస్ట్, ప్లంబర్ ఒక్కో పోస్టు చొప్పన భర్తీ చేస్తామన్నారు. ఈనెల21 నుంచి 28వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులను జిల్లాకేంద్రంలోని పాతూరు సీడీఆస్పత్రి ఆవరణలో ఉన్న డీసీహెచ్ఎస్ ఆఫీస్‌లో అందజేయాలన్నారు. ఈ పోస్టులకు సంబంధించిన సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

24న పుట్టపర్తిలో మినీ మహానాడు

పుట్టపర్తి, మే16(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి టీడీపీ మినీ మహానాడు ఈనెల 24న పుట్టపర్తిలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప తెలిపారు. అనంతపురంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, మాజీ మంత్రి పల్లెరఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా హిందూపురం పార్లమెంట్ స్థాయిలో మినీ మహానాడు నిర్వహణపై చర్చించారు. పుట్టపర్తిలో 24న నిర్వహించాలని తీర్మానం చేసినట్లు జిల్లా అధ్యక్షుడు అంజినప్ప తెలిపారు.

ఎయిడెడ్ స్కూళ్లలో 10 పోస్టులకు దరఖాస్తులు

అనంతపురం విద్య, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు ఎయిడెడ్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న 10 టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక రామచంద్రనగర్‌లోని సెయింట్ మేరీస్ బాలికల ఉన్నత పాఠశాలలో 5 పోస్టులు ఉన్నాయన్నారు. స్కూల్ అసిస్టెంట్ బయాలజీ, తెలుగు, లాంగ్వేజ్ పండిట్ తెలుగు, హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆర్‌సీఎం ఎయిడెడ్ ప్రైమరీ స్కూల్‌లో 5 ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. జిల్లాలోని ఆసక్తి, అర్హత ఉన్న యువతీయువకులు ఈనెల 31వ తేదీలోగా పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ http://cse.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి పూజలు



హనుమద్ సమేత లక్ష్మీగణపతి

అనంతపురం కల్చరల్, మే 16(ఆంధ్రజ్యోతి): సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాల్లో పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మల్లేశ్వర రోడ్డులోని లక్ష్మీగణపతి మందిరం, మూడో రోడ్డు షిర్డిసాయిబాబా ఆలయం, తిలక్‌రోడ్డు రామాలయం తదితర ఆలయాల్లో గణనాథుడి మూలవిరాట్లకు ఫలపంచామృతాభిషేకాలు చేసి గరిక, కుడుముల మాలలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

19న ప్రభుత్వోద్యోగుల సంఘం ఎన్నికలు

అనంతపురం సెంట్రల్/ రాప్తాడు, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సంఘం అనంతపురం రూరల్ (రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్) కమిటీ ఎన్నికలను ఈ నెల 19 నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా జిల్లా సహాధ్యక్షుడు వేణుగోపాల్, సహాయ ఎన్నికల అధికారిగా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నాగరాజును నియమించినట్లు తెలిపారు. రోడ్లు, భవనాల అతిథి గృహం వద్దనున్న ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నిర్వహించే ఎన్నికల్లో పాల్గొనాలని ఉద్యోగులను గోపికృష్ణ కోరారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు



అనంతపురం సెంట్రల్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటకు వచ్చిన కేంద్ర రైల్వేశాఖ, జల జీవన్ మిషన్ సహాయ మంత్రి సోమన్నను శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ కలిశారు. జిల్లాలోని రైల్వేస్టేషన్ల అభివృద్ధిపై మంత్రికి వివరించినట్లు ఆయన తెలిపారు.

తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజర్‌ను పునఃప్రారంభించాలి

● మంత్రికి బీజేపీ కళ్యాణదుర్గం నాయకుల వినతి

అనంతపురం న్యూటౌన్ మే 16(ఆంధ్రజ్యోతి) కళ్యాణదుర్గం నియోజవర్గం మీదుగా రాకపోకలు సాగిస్తున్న తిరుపతి - కదిరి దేవరపల్లి ప్యాసింజర్‌ను వీలైనంత త్వరగా పునప్రారంభించేలా చూడాలని బీజేపీకళ్యాణదుర్గం నియోజవర్గ కన్వీనర్ దేవరాజు కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నను అనంతపురంలో కలిసి వినతిపత్రం సమర్పించి విన్నవించారు. దీంతో పాటు రాయదుర్గం నుంచి టుంకూరు రైల్వే లైను నిర్మాణం పనులు ప్రారంభమై చాలా సంవత్సరాలు కావస్తున్నా.. పూర్తి కాలేదన్నారు.. వీలైనంత త్వరగా పనులు పూర్తి అయ్యేలా చూడాలనికోరారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

అనంతపురం కల్చరల్, మే 16(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులను పురస్కరించుకుని రామకృష్ణ సేవా సమితి కార్యాలయంలో నాలుగో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు ఈ నెల 1 నుంచి నిర్వహిస్తున్న వేసవి ఆధ్యాత్మిక శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి స్వామి అర్చనానంద మహరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులకు ఆధ్యాత్మిక బోధన చేశారు. చిన్నారులు దేశభక్తుల వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో నిర్మలమ్మ, రామకృష్ణ సేవాసమితి వ్యవస్థాపకుడు శ్రీధరమూర్తి, అధ్యక్షుడు శ్రీకృష్ణశశి, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, జైపాల్‌రెడ్డి, కేశవమూర్తి, రవిశంకర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



లీలావతికి సన్మానం చేస్తున్న కాపు భారతి

నార్పల, మే 16 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన నార్పల క్రాసింగ్‌లో ఉన్న కాఫీ టైం కేఫ్ లో అబ్దుల్ కలామ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ అనంతపురం జిల్లా చైర్ పర్సన్ కాపు భారతి, వైస్ చైర్మన్ డాక్టర్ లక్ష్మణప్రసాద్, నార్పలకు చెందిన అమరవీరుడు సుబ్బయ్య సతీమణి గవ్వల లీలావతి పాల్గొన్నారు. అమరవీరులు సుబ్బయ్య, మురళీనాయక్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. 123 మంది రక్తదానం చేయగా, వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలామ్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు పీటర్ విజయ్, గవ్వలశివ, బూసి, దిలీప్, రాయల్‌దిలీప్, ఏ తిరుపాల్, అశోక్, సైపుల్లా, గవ్వల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఇటుకలపల్లి కమిటీ అధ్యక్షుడి ఎంపిక

అనంతపురం రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండలంలోని ఇటుకపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వెంకటరాముడిని ఎంపిక చేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గ్రామస్థులు సమావేశమయ్యారు. సమావేశంలో అధ్యక్షుడిగా బోయ వెంకటరాముడు, ఉపాధ్యక్షుడిగా గంగాధర్‌ను ఎంపిక చేశారు. ఈ టీడీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన

అనంతపురం సెంట్రల్, మే16(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభా వాలపై విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. స్థానిక శ్రీసాయివెంకటేశ్వర ఐటీఐ శాలలో శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా ఏడీ వినోద్ హాజరై మాట్లాడారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బందితోపాటు డ్రగ్ డీ అడక్షన్ సెంటర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాయునాళంలో కణితి తొలగించిన కిమ్స్ సవీరా వైద్యులు

అనంతపురం టౌన్, మే16 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధుడికి వాయునాళంలో ఏర్పడిని కణితిని స్థానిక కిమ్స్ - సవీరా వైద్యులు అదునాతన పద్ధతిలో శస్త్రచికిత్సచేసి తొలగించి ప్రాణంకాపాడారు. సంబంధిత వివరాలను శుక్రవారం డాక్టరు యశోవర్ధన్ విలేక రుల సమావేశంలో వెల్లడించారు. నగరానికి చెందిన 64ఏళ్ల వృద్ధుడు కేశవరెడ్డి విపరీతమైన దగ్గు, ఆయాసంతో చికిత్సకోసం 20రోజుల క్రితం సవేరా ఆస్పత్రికి వచ్చారు. అక్కడ పరీక్షలు చేయగా అతడి వాయునాళానికి కణితి ఉండడం వల్ల ఊపరి పీల్చుకోవడం కష్టంగా మారిందని వైద్యులు గుర్తించారు. కుటుంబసభ్యుల అంగీకారంతో అత్యాధునిక పరిజ్ఞానంతో రిజిడ్ బ్రాంకోస్కోప్ అనేపరికరంతో ఆకణితిని తొలగించారు. ఇపుడు కేశవరెడ్డి సాదారణంగా ఊపరి తీసుకుంటున్నారు. ఆరోగ్యంకుదటపడడంతో డిశ్చార్జ్‌చేస్తున్నట్లు డాక్టరు తెలిపారు.

వర్షం నీరు వెళ్లేదెలా..?

● వైఎస్సార్ కాలనీలో ఇళ్ల మధ్యే నిలుస్తున్న నీరు
● కాలనీ వాసులకు తప్పని అవస్థలు



కురుగుంట వైఎస్సార్ కాలనీ

అనంతపురం రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): కాలనీలోకి వచ్చిన వర్షపు నీరు వెళ్లేందుకు వీలులేక పోవడంతో కురుగుంట వైఎస్సార్ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే వారి అవస్థలు వర్ణతీతం. రూరల్ మండలం కురుగుంట పంచాయతీలోని పాత కురుగుంటతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన యాలేరు, మదిగుబ్బ, కామారుపల్లి ప్రాంతాల పరిధిలోని పొలాల నుంచి పారే వర్షపు నీరు వైఎస్సార్ కాలనీ నుంచి సమీపంలోని తడకలేరు లోకి వేళ్లేందుకు చిన్న పాటి వంక ఉంది. అయితే కాలనీ సమీపంలో ఓ వెంచర్‌దారులు ఆ వంకను కుదించి ప్రహరీ నిర్మాణం చేపట్టారు. దీనికితోడు చిన్న పాటి రంధ్రం ఏర్పాటు చేసి దాని మధ్యలో మళ్లీ కడ్డీలు ఏర్పాటు చేశారు. దీంతో వర్షం వచ్చిందంటే చాలు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కాలనీకి పారిన వర్షపు నీరు వెళ్లేందుకు సమస్యగా మారింది. సవ్యంగా పారేందుకు వీలు లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడల్లా ఆ నీరంతా కాలనీలోని ఇళ్ల మధ్య చేరుతోందని కాలనీ వాసులు వాపోతున్నారు. దీంతో నానా అవస్థలు పడుతున్నామని అంటున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయిందని అంటున్నారు. ఆరు నెలల కిందట కురిసిన వర్షాలకు ఇళ్ల మధ్యకు, ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడ్డామంటున్నారు. ఇప్పుడు మళ్లీ వర్షాలు కురుస్తున్నాయని, మళ్లీ అవే అవస్థలు పడాల్సి వస్తుందని వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి కొంత వరకు ఇబ్బందులు పడ్డామని, మరింత జోరువాన కురిస్తే సమస్య తీవ్రతరం అయ్యే అవకాశం లేకపోలేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



వెంచర్ దారులు ప్రహరీ నిర్మించి నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రంధ్రం

మంత్రి లోకేశ్‌కు అపూర్వ స్వాగతం



గజమాలతో మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

అనంతపురం అర్బన్ మే 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేశ్‌కు అనంతపురం నగర శివారులోని తపోవనం వద్ద అపూర్వ స్వాగతం పలికారు. శుక్రవారం గుత్తిలో పర్యటన ముగించుకొని నగరానికి వచ్చిన నారా లోకేశ్‌కు రెండు భారీ జగమాలలతో స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తన తరలివచ్చారు. అలాగే మధ్యాహ్నం జేఎన్‌టీయూ హెలి ప్యాడ్ వద్ద ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళి, మాజీ మేయర్ స్వరూప, టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, గంగారామ్, కూచి హరి, రాయల్ మురళి, రాయల్ మధు, రమేష్, జోగి రాజేంద్ర, చేపల హరి, సిమెంట్ పోలన్న, పరమేశ్వరన్, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పీఎల్ఎన్ మూర్తి, ఓంకార్‌రెడ్డి, డిష్ నాగరాజు, రాయల్ రఘు, ఓబుళపతి, నెట్టెం బాలకృష్ణ, తెలుగు మహిళలు స్వప్న, సంగా తేజస్విని, చరిత, భవానితోపాటు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌కు ఘనంగా వీడ్కోలు

● ప్రధాని అపాయింట్‌మెంట్‌తో మూడో రోజు పర్యటన రద్దు



మంత్రి లోకేశ్‌కు గిఫ్ట్ అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్ మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారాలోకేశ్ గురువారం జిల్లాకు వచ్చారు. మొదటి రోజు గుత్తిలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రెండో రోజు శుక్రవారం గుత్తి మండలం బేతాపల్లి సమీపంలో రూ. 22వేల కోట్లతో రెన్యూ పవర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మధ్యాహ్నం కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆ తర్వాత ఇటీవలే గుండెపోటుతో మరణించిన టీడీపీ మైనార్టీ రాష్ట్ర నాయకులు కేఎం జకీవుల్లా కుటుంబాన్ని ఆయన ఇంటికి వెళ్లి మంత్రి పరామర్శించారు. ఇదే సందర్భంలోనే ప్రధాని నరేంద్రమోదీ అపాయింట్‌మెంట్‌ఖరారు కా వడంతో... ఆ తర్వాత పలు కార్యక్రమాలతో పాటు శనివారం జేఎన్‌టీయూలో నిర్వహించే స్నాతకోత్సవానికి హాజరుకావడాన్ని రద్దు చేసుకొని మధ్యాహ్నం 3 గంటల సమయంలో హెలికాప్టర్‌లో అమరావతికి బయలు దేరి వెళ్లారు. కాగా మంత్రి లోకేశ్‌కు మంత్రి సవిత, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీ టీకే పార్థసారథి, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, నాయకులు ఎద్దుల సుబ్రహ్మణ్యం, తలారి ఆదినారాయణ తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు.

మంత్రి లోకేశ్‌కు కలెక్టర్ అరుదైన జ్ఞాపిక

జిల్లాలో పర్యటనను ముగించుకొని అమరావతికి బయలుదేరిన రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారాలోకేశ్‌కు జేఎన్‌టీయూ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ వినోద్‌కుమార్ జిల్లా యంత్రాంగం తరపున అరుదైన జ్ఞాపికను అందజేశారు. అరటి నారతో తయారు చేసిన బ్యాగ్, పట్టు శాలువ, తోలుబొమ్మలాట తెలిపే బెడ్ ల్యాంప్, రాయదుర్గంలో తయారు చేసిన స్ప్రింగ్ బ్యాగ్‌తో కూడిన గిఫ్ట్ యాంపర్‌ను మంత్రికి అందజేశారు. ఆ అరుదైన గిఫ్ట్ యాంపర్ గురించిన వివరాలను మంత్రి లోకేశ్ కలెక్టర్‌తో ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.

జకీవుల్లా కుటుంబ సభ్యులకు లోకేశ్ పరామర్శ



కేఎం జకీవుల్లాకు నివాళులర్పిస్తున్న మంత్రి నారా లోకేశ్

అనంతపురం అర్బన్ మే 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ దివంగత నాయకులు కేఎం జకీవుల్లా కుటుంబ సభ్యులను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. కేఎం జకీవుల్లా ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేశ్ నగరంలోని ఆయన స్వగృహానికి వెళ్లారు. ముందుగా కేఎం జకీవుల్లా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. జకీవుల్లా తండ్రి మాజీ ఎంపీ సైపుల్లా, కుమారుడు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు. జకీవుల్లా పార్టీకి చేసిన సేవలను ఆయన గుర్తుచేసుకున్నారు. సైపుల్లా కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. మంత్రి వెంట ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, నాయకులు సింగవరం రవి, లక్ష్మీనాయుడమ్మ, కృష్ణకుమార్ తదితరులు ఉన్నారు.

పరిటాల ఇంటికి కేంద్ర మంత్రులు



పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌తో మాట్లాడుతున్న కేంద్ర మంత్రులు సోమన్న, రామ్మోహన్‌నాయుడు



అనంతపురం అర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరంలోని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇంటికి కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు వెళ్లారు. శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన వారు పరిటాల సునీత ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థలు వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ధర్మవరం నుంచి నాగసముద్రం మధ్య డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో చైనేజ్ 171-600 వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైల్వే సహాయ మంత్రి దృష్టికి వారు తీసుకెళ్లారు. లెవల్ క్రాసింగ్ గేట్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కదిరిదేవరపల్లి రైలులో పావగడ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల ప్రజలు తిరుపతికి వెళ్లాలంటే కంబదూరు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, బళ్లారి, గుంతకల్లు, అనంతపురం మీదుగా ధర్మవరానికి 260 కిలో మీటర్లు దూరం చుట్టిరావాల్సి వస్తోందన్నారు. అలా కాకుండా కంబదూరు నుంచి పేరూరు, రామగిరి మీదుగా నాగసముద్రం గేటు వరకు కొత్త రైల్వేలైన్ వేస్తే 200 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. వీటిని పరిష్కరించాలని మంత్రిని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

● అనంతపురం రూరల్: మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్ కేంద్ర మంత్రులను కలిశారు. నగరంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో వారిని కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేశారు.

డెంగీపై అవగాహన

చెన్నేకొత్తపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ గేటు ఆస్పత్రి వైద్యాధికారులు డాక్టర్ రవినాయక్, డాక్టర్ సరిత ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలలోని ఎన్ఎస్ గేటులో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆస్పత్రి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్ వైజర్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

●నార్పల: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని బీ పప్పూరులో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీని నిర్వహించారు. డాక్టర్ సునీత, పర్యవేక్షకులు శ్రీరాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనకు సర్వం సిద్ధం: కలెక్టర్



వేదిక ఏర్పాట్లపై రిజిస్ట్రార్ క్రిష్ణయ్యతో ఆరాతీస్తున్న కలెక్టర్

అనంతపురం సెంట్రల్, మే 16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ స్నాతకోత్సవాలను పురస్కరించుకుని శనివారం జిల్లాకు వస్తున్న రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ పర్యటనకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఆయన జేఎన్టీయూ, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, రైల్వేస్టేషన్, ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గవర్నర్ పర్యటించే అన్ని ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు, రైల్వేస్టేషన్ వీఐపీ లాంజ్‌లో ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రైల్వే స్టేషన్ నుంచి ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ వరకు, అక్కడి నుంచి జేఎన్టీ యూ వరకు కాన్వాయ్‌ను సిద్ధంగా ఉంచాలన్నారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో సేఫ్‌హౌస్‌ను సిద్ధం చేయాలన్నారు. జేఎన్టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియం, అలుమ్ని గెస్ట్ ఏర్పాట్లపై రిజిస్ట్రార్ క్రిష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జునుడు, రామ్మోహన్, రైల్వేస్టేషన్ మేనేజర్ అశోక్ బాబు, డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ ఈఈ ఆటమయ్య, సీఐలు రాజేంద్రనాథ్, వెంకటేష్‌నాయక్, శాంతిలాల్, వెంకటేష్ నాయక్, తసీల్దార్లు హరిప్రసాద్, బ్రహ్మయ్య, ఏడీఎస్ఓ జగన్మోహన్ రావుతోపాటు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీకి తరలిరండి : ఎమ్మెల్యే

శింగనమల, మే 16(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా అనంతపురంలో శనివారం ఉదయం నిర్వహించే తిరంగ ర్యాలీకి శింగనమల నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పిలుపుచ్చారు. శనివారం ఉదయం 7గంటలకు అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజీ నుంచి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. శింగనమల నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ

● మూడోరోజూ కొనసాగిన దుర్గాంబ ఉత్సవాలు



విగ్రహ పునఃప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే

రామగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట సమీపంలో వెలసిన దుర్గాంబ దేవత ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అభయాంజనేయస్వామి విగ్రహాన్ని వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ పునఃప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుటుంబ సభ్యులతో పాటు నసనకోట, వెంకటాపురం, గంగంపల్లి గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మహిళలు వాయినాలు ఇచ్చి పుచ్చుకునే కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆయా గ్రామాల్లో వారివారి బంధువులతో సందడి నెలకొంది. భక్తులు ఆల యం వద్దకు విశేషంగా తరలివస్తున్నారు. భక్తులు సౌకర్యార్థం అన్నదానం చేపట్టారు. గుంటూరుకు చెందిన లక్ష్మీదేవి, రామాంజినేయులు దంపతులు బీరువాను వితరణ చేశారు. వడ్డమూరి మీరా కుటుంబసభ్యులు పలు వస్తువులను వితరణ చేశారు.

'దళిత మహిళలపై దాడి అమానుషం'

అనంతపురం కల్చరల్, మే 16(ఆంధ్రజ్యోతి): బ్రహ్మసముద్రం మండలంలోని ఓ గ్రామంలో దళిత మహిళలపై దాడి అమానుషమని, దాడిచేసిన పెత్తందారులపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత బుధవారం బ్రహ్మసముద్రం మండలంలో ముగ్గురు దళిత మహిళలను యాటకల్లు గ్రామానికి చెందిన కొందరు రైతులు కులం పేరుతో దూషిస్తూ కొట్టారన్నారు. వారిపై ప్రభుత్వం వెంటనే హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధకచట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

● అనంతపురం సెంట్రల్: గత ప్రభుత్వంలో అచాచకాలు మరువక మునుపే ఈ ప్రభుత్వంలోనూ దళితులపై దాడులు చేయడం అమానుషమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి మండిపడ్డారు. ఆయన శుక్రవారం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో బాధిత మహిళలను పరామర్శించి మాట్లాడారు. దాడి చేసిన వారిపై అట్రాసిటి కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, రామాంజినేయులు, నరేంద్ర, నగేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని ర్యాలీ



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఆర్డీటీ పూర్వ విద్యార్థులు

అనంతపురం కల్చరల్, మే 16(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని కోరుతూ 23వ డివిజన్‌లోని తారా విద్యాలయానికి చెందిన ఆర్డీటీ పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మహిళా సంఘాల నేతలు, నాయకులు, అభిమానులు శుక్రవారం సాయంత్రం నగరంలో శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఏను పునరుద్ధరించేవరకూ తమ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు.

ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

● పార్టీ శ్రేణులతో జనసేన ఎమ్మెల్యే నాయకర్



జనసేన పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న నర్సాపురం ఎమ్మెల్యే

అనంతపురం సెంట్రల్, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జనసేన పార్టీ నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నారాయణ నాయకర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయనను జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో ఆపార్టీ శ్రేణులతో సమావేశమై మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, కార్యక్రమాల కమిటీ ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, జయరాంరెడ్డి, చంద్రశేఖర్, ధనుంజయ, సంజీవరాయుడు, జయమ్మ, విజయకుమార్, దివాకర్, వెంకటేష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీల సహకారంతోనే ఓడీఎఫ్ ప్లస్ డిక్లరేషన్

● ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్ మే 16(ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఓడీఎఫ్ ప్లస్ డిక్లరేషన్ సాధించగలి గామంటే అది ఎమ్మార్సీల కృషేనని ఆర్‌డబ్లూఎస్ ఎస్ఈ సురేష్ ఎమ్మార్సీలను అభినందించారు. ఆయన శుక్రవారం స్థానిక కార్యాల యంలోని సమావేశ భవనంలో ఈఈ మురళీధర్‌రావుతో కలిసి జిల్లాలోని ఎమ్మార్సీలతో సమావేశం నిర్వహించారు. ఓడీఎఫ్ ప్లస్ డిక్లరేషన్‌కు క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలపై వారిని అడిగి తెలుసుకున్నారు. మరిన్ని ప్రాంతాల్లో మరింత మెరుగైన చర్యలు చేపట్టాలని సూచించారు. సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చర్యల్లో భాగంగా చెత్త ఎక్కడా డంప్ కాకుండా మురుగు నీరు నిలువ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

అంగట్లో రూ.80వేల చోరీ

అనంతపురం క్రైం, మే 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాణీనగర్‌లోని జొన్నల దుకాణంలో ఓ వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. శుక్రవారం దుకాణంలో వృద్ధుడు ఉన్న సమయంలో ఓ వ్యక్తి దుకాణానికి వచ్చాడు. ఆ వృద్ధుడిని ఏమార్చి క్యాష్‌బాక్స్‌లో ఉన్న రూ.80వేలు ఎత్తుకెళ్లాడు. దీనిపై బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బ్రహ్మసముద్రం, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుగేపల్లి గ్రామంలో శుక్రవారం మారెమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. తొలుత అర్చకులు అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గణపతి పూజ, పాలాభిషేకం, హోమం నిర్వహించి ఆలయంలో ప్రతిష్ఠించారు. గ్రామస్థులు, భక్తులు భారీగా పాల్గొన్నారు.


ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

లారీ ఢీకొని 20 జీవాల మృతి

గుత్తిరూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊబిచెర్ల గ్రామశివారులో 44 వ జాతీయ రహదారిపై శుక్రవారం లారీ ఢీ కొని 20 జీవాలు మృతి చెందాయి. మరో ఐదింటికి గాయాలయ్యాయి. కొత్తపేట గ్రామానికి చెందిన శివ, సూరి, లక్ష్మీనారాయణ అనే గొర్రెల కాపర్లు ఊబిచెర్ల గ్రామశివారులోకి గొర్రెలను, పొట్టేళ్లను మేత కోసం తీసుకెళ్తున్నారు. ఈక్రమంలో రోడ్డుపై వెళ్తుండగా.. ఓ లారీ వాటిపై వేగంగా దూసుకెళ్లింది. ప్రమాదంలో 20 జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఐదు తీవ్రంగా గాయపడ్డాయి. స్థానికులు వెంటనే లారీని నిలిపి పోలీసులకు సమాచారం అందజేశారు. రూ.2.60 లక్షల వరకు నష్టం వాటిల్లిందని గొర్రెల కాపరులు వాపోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

కొనసాగిన సర్వే

శెట్టూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఐఈఆర్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపునకు శుక్రవారమూ సర్వే కొనసాగించామని, ఇప్పటివరకు 14 మందిని గుర్తించామని ఎంఈవో2 వాణిదేవి తెలిపారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలు మండలంలో ఉన్న భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని వారి తల్లిదండ్రులకు సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. ఆ పిల్లలకు ప్రభుత్వం నాలుగు రకాల అలవెన్స్‌లు అందించనున్నట్లు పేర్కొన్నారు.

సమస్య పరిష్కారం కోసం.. ఫొటోతీసి పంపండి

● యాడికిలో టీడీపీ కార్యాలయం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు

యాడికి, మే 16(ఆంధ్రజ్యోతి): సమస్యలు ఏవైనా ఉంటే వాటిని ఫొటో తీసి 7998799499 కు వాట్సప్ పంపండి అంటూ మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ చర్చనీయాంశమైంది. ఈ ఫ్లెక్సీని స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. అందులో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఫొటోతో పాటు సమస్యల ఫొటో పంపించాల్సిన ఫోన్‌నెంబరు ఏర్పాటు చేశారు. ఏదేని సమస్యలుంటే ఫొటోతో పాటు వాట్సాప్ చేస్తే పరిష్కరిస్తామన్నట్టుగా ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీనిని గమనించిన స్థానికులు సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చూపుతున్న చొరవపై అభినందిస్తున్నారు.


కార్యాలయంపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

గ్రామాల్లో నారా లోకేశ్‌కు అపూర్వ ఆదరణ

● ఆయన రాకకోసం పెద్దఎత్తున వేచి ఉన్న ప్రజలు


వెంగన్నపల్లిలో లోకేశ్ కాన్వాయ్‌ను స్వాగతిస్తున్న గ్రామస్థులు


చిన్నారిని ఎత్తుకుని ముద్దు చేస్తున్న నారా లోకేశ్


లోకేశ్‌ను చూసేందుకు మిద్దెలపైన వేచి ఉన్న మహిళలు


టీడీపీ జెండా చేతపట్టి తల్లితో పాటు ఎదురుచూస్తున్న చిన్నారి

గుత్తిరూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు గ్రామాల్లో ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అపూర్వంగా ఆదరించారు. మండలంలోని బేతాపల్లిలో శుక్రవారం చేపట్టిన రెన్యూ విండో ఎనర్జీ ప్రైవేట్ కంపెనీ ప్రారంభోత్సవానికి నారా లోకేశ్ చెట్నేపల్లి, యంగన్నపల్లి గ్రామాల మీదుగా వస్తున్నట్లు తెలియడంతో ఆయా గ్రామాల ప్రజలు, టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున వేచి చూశారు. మంత్రి రాగానే ప్రజలు ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. యంగన్నపల్లిలో మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అక్కడ ఆయన చిన్నారిని ఎత్తుకొని ముద్దాడారు. యంగన్నపల్లి సర్పంచు భరత్ పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్ గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సురేష్, తహసీల్దార్ ఓబులేసు, పీఆర్ డీఈ మురళీధర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని ఆర్పీల వినతి

పామిడి: తమకు ఆరు నెలలుగా వేతనాలు రాలేదని, వెంటనే వాటిని చెల్లించేలా చూడాలని పామిడికి చెందిన డీఆర్‌డీఏ ఆర్పీలు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. గుత్తిలో వారు లోకేశ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆర్పీలు పేర్కొన్నారు.

చిన్నారి నవనికి లోకేశ్ అభినందనలు

గుత్తి: పట్టణంలో ఏర్పాటుచేసిన ప్రజా దర్బార్‌లో మంత్రి నారా లోకేశ్‌ను కేంద్రీయ విద్యాలయం అనంతపురం శాఖలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థి సుంకర నవని కలిసి మొక్కలు నాటడం వల్ల కలిగే లాభాలను వివరించింది. ఇందుకు మంత్రి ఆ చిన్నారిని అభినందించారు. ప్రతి ఆదివారం మొక్కలు నాటడం హాబీగా పెట్టుకుని ఇప్పటి వరకు 117 మొక్కలను నాటినట్లు చిన్నారి తెలిపింది. అలాగే దాదాపు 1300 మొక్కలను తన తోటి మిత్రుల చేత నాటించినట్లు చెప్పింది. అలాగే ట్రీగార్డ్ కోసం ఫండ్ వసూలు చేశానని, ఆ హుండీని నారా లోకేశ్‌కు అందజేయగా.. ఆయన ఆ హుండీని తిరిగి నీవే తీసుకుని ఇంకా ఫండ్ వసూలు చేయమని, మొక్కల సంరక్షణకు నీవే వాడాలని తెలియచేశారు. చిన్న వయసులోనే ప్రకృతి పరిరక్షణపై సామాజిక స్పృహ కలిగి ఉండడం అభినందనీయమని తెలిపారు. ఆ చిన్నారి తల్లిదండ్రులను, గురువులను కూడా ఆయన అభినందించారు.


చిన్నారిని అభినందిస్తున్న నారా లోకేశ్

సూర్యప్రభ వాహనంపై నారసింహుడు

ఉరవకొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సూర్యప్రభ, ఐరావత వాహనసేవలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయ మే ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ఉత్సవ విగ్రహాలను సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి చుట్టూ ఊరేగించారు. కార్యక్రమానికి అనంతపురానికి చెందిన నారాయణస్వామి కుటుంబసభ్యులు దాతలుగా వ్యవహరించారు. తర్వాత ఉత్సవమూర్తులను ఐరావతవాహనంలో కొలువుదీర్చి ఊరేగించారు. కార్యక్రమానికి పెద్దముష్టూరుకు చెందిన నెట్టెం జయచంద్ర, ఎర్రిస్వామి ఉత్సవ ఉభయదాతలేగా వ్యవహరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో రమేష్‌బాబు, సిబ్బంది, అర్చకులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.


సూర్యప్రభ వాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

వైభవంగా కలుహోళ దర్గా ఉరుసు

బొమ్మనహాళ్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుహోళ హజరత్ సయ్యద్ షహబాజ్ దివాన్ మలంగ్ దర్గా ఉరుసు ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం దర్గా పీఠాధిపతులు చాందినీని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్గా వద్ద చెక్కర చదివింపులు చేయించి మొక్కులు చెల్లించారు. శనివారం వేకువజమున గుర్రం సవారి జరపనున్నట్లు దర్గా పీఠాధిపతులు తెలిపారు.


దర్గాలో చాందినీని నిర్వహిస్తున్న పీఠాధిపతులు

దర్గాహొన్నూరులో తీరిన తాగునీటి సమస్య

బొమ్మనహాళ్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఈఓపీఆర్డీ దాస్, సర్పంచ్ శకుంతలమ్మ చర్యలు తీసుకున్నారు. అక్కడ తాగునీటి ఎద్దడి నెలకొని ప్రజలు ఇబ్బందులు పడుతుండడంపై ఈనెల 11వ తేదీన ఆంధ్రజ్యోతిలో దర్గాహొన్నూరులో దాహం.. దాహం అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. డిప్యూటీ ఎంపీడీఓ దాస్ గ్రామంలోని బోరుమోటారుకు మరమ్మతులు చేయించి, పైపులైన్ సమస్య పరిష్కరించి నీటి సరఫరా అయ్యేలా చేశారు. గ్రామస్థులు అక్కడ నీటిని పట్టుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశులు, టీడీపీ నాయకుడు ముక్కన్న తదితరులు పాల్గొన్నారు.


బోరు నుంచి వస్తున్న నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

ఆంధ్రజ్యోతి స్పందన

ఘనంగా ఎమ్మెల్యే అశ్మిత్ జన్మదిన వేడుకలు


యాడికి వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న ఎస్సీసెల్ నాయకుడు


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న పుట్లూరు మండల నాయకులు


పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆరోగ్యశాఖ ఎస్ఈ

యాడికి/తాడిపత్రి/ పుట్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం యాడికి మండలవ్యాప్తంగా టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆగాపే వృద్ధాశ్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే నాయకులు విశ్వనాథ్, తిరంపురం నీలకంఠ, నారాయణస్వామి తదితరులు మండల క్రికెట్ ప్రీమియర్‌లీగ్ పోటీలను నిర్వహించారు. రాయలచెరువులో పలువురు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అదేవిధంగా తాడిపత్రి పట్టణంలోని నివాసంలో ఎమ్మెల్యేను ప్రజా ఆరోగ్యశాఖ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి కలిశారు. పుష్పగుచ్ఛం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఇక పుట్లూరు మండల టీడీపీ నాయకుడు చవ్వా కులశేఖర్‌రెడ్డి తదితరులు తాడిపత్రికి వెళ్లి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కేక్‌కట్‌చేశారు. తర్వాత ఆయన్న సన్మానించారు. నాయకులు పుట్లూరు పుల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, రవి కుమార్‌రెడ్డి, సర్పంచు శివరామయ్య, గిరిరెడ్డి, శివారెడ్డి, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

బెళుగుప్ప, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెళుగుప్ప, బ్రాహ్మణపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ గంగాధర శుక్రవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ రెండు సబ్ స్టేషన్లలో మరమ్మతులు చేపట్టనున్నారని, కనుక విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

పుట్లూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహం తెలిపారు. స్థానికుడైన వెంకటరంగయ్య బైక్‌లో మద్యం ఉంచి అక్రమంగా విక్రయిస్తుండగా సమాచారం అందిందని, వెంటనే సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశామని అన్నారు. అతడి వద్ద నుంచి 110మద్యం, 24బీరుబాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. తర్వాత కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

క్రీడాకారులకు అభినందనలు

ఉరవకొండ, మే 16(ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగిన జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకూ జరిగిన పోటీల్లో రాష్ట్రం తరపున జిల్లా క్రీడాకారులైన అమృత, మానస, పవిత్ర, సురేఖ, సుస్మిత పాల్గొన్నారు. రాజస్థాన్, బీహార్, కేరళ రాష్ట్రాల జట్లుపై గెలిచి బ్రాంజ్ మెడల్ సాధించారు. ఆ క్రీడాకారులను ఉరవకొండలో శుక్రవారం సెపక్ తక్రా అసోసియేషన్ చైర్మన్ మల్లికార్జున, అధ్యక్షుడు షాహిన్ అభినందించారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

తాడిపత్రి, మే 16(ఆంధ్రజ్యోతి): పుట్లూరు మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన బాలిక లక్ష్మీనరసమ్మ (17) అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిందని రూరల్ ఎస్ఐ కాటయ్య తెలిపారు. తక్కళ్లపల్లికి చెందిన విజయలక్ష్మి, ఆమె కుమార్తె లక్ష్మీనరసమ్మ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. కాగా వారిద్దరూ ఇటీవల వ్యక్తిగత పనినిమిత్తం స్కూటీలో తాడిపత్రికి వచ్చి తిరిగి వెళుతుండగా చల్లవారిపల్లి సమీపంలో రోడ్డుప్రమాదం జరిగింది. ఇందులో లక్ష్మీనరసమ్మకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగం పేరుతో మోసం

తాడిపత్రి, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసపురానికి చెందిన ఇలావ్ బెంగళూరులో ప్రైవేట్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే అతడి మిత్రుడు రాయచోటికి చెందిన మహేశ్వరరెడ్డి ఇంకా మంచి ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి అతడి నుంచి రూ.1.80 లక్షలు డబ్బులు వసూలు చేశాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. మోసపోయానని గ్రహించిన ఇలావ్ శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

20 నుంచి ధార్మిక కార్యక్రమాలు

కంబదూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రామాలయంలో ఈ నెల 20 నుంచి టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటన లో తెలిపారు. 23వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. మండలవ్యాప్తంగా భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రకటన

గుదే ఉమాదేవి,W/o గుదే రమేష్ నాయుడు, D.No.10-18, యాడికి గ్రామం &మండలం వారికి సంబంధించిన ఆస్తి యాడికి మండలం యాడికి గ్రామంలో 7వ వార్డ్ రెసిడెన్షియల్ ఏరియాలో సర్వేనెం. 1609A లో బిటెం నెం. 1లో D.No. 7-266A గల ఇంటిని, బిటెం నెం. 2లో బయలు జాగా ఆస్తులను గుదే ఉమాదేవి భర్త గుదే రమేష్ నాయుడు గుత్తి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుతున్నది. ఈఆస్తి పైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నయెడల గుత్తి శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు:తూర్పు: దిగువ కనబరిచిన బిటమ్.2బయలు జాగా,పడమర: నీ స్వంత బయలు జాగా,ఉత్తరం : 14 అడుగుల రస్తా, దక్షిణము: మైసూర్ కుళ్లాయి వగైరాల బయలు జాగా.
M.G. భాస్కర్‌గౌడ్ అడ్వకేట్, గుంతకల్లు

ప్రకటన

మనియార్ గౌసియా బేగం, W/o S.షౌకత్ అలీ, D.No.10-116, అమిద్యాల వీధి, పామిడి, పామిడి మండలం వారికి సంబంధించినఆస్తి పామిడి పంచాయతీ గ్రామ పొలంలో D.No.9/108 కి సమీపాన అమిద్యాల వీధిలో ఉండు ఆస్తి సర్వే నెం. 993/Aలో 45.63 గజాలు స్థలాన్ని మరియు షాజహాన్ బి పేరు మీద ఉన్న D.No.1-8-171 గల ఇల్లు పడిపోయి మొండి గోడలు గల స్థలమును గుత్తి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుతున్నది. ఈఆస్తి పైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నయెడల గుత్తి శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు : తూర్పు : 9/109 గల P. అదం భాన్ ఇల్లు, పడమర:9/108 జుట్టు శిలార్ బీ ఇల్లు, ఉత్తరం :రస్తా, దక్షిణము:P. అదం భాన్ ఇల్లు.
M.G. భాస్కర్‌గౌడ్ అడ్వకేట్, గుంతకల్లు

ప్రకటన

డి.రేణుకమ్మ W/o మద్దుకుంట హనుమంతు డి.నెం. 1-133, వర్రహోన్నూరు గ్రామం, బొమ్మక్కపల్లి పోస్ట్, రాయదుర్గం, అనంతపురం జిల్లా. Doc. No. 482 /2017. సర్వే నెం. 73-ఎ లో స్థలంను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రాయదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైన అభ్యంతరాలు, తకరార్లున్నచో 7 రోజులలోపు రాయ దుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజరును సంప్రదించగలరు.
హద్దులు : తూర్పు : ఇదే సర్వే నెంబరులో బసప్ప గారి హనుమంతరాజు స్థలం, పడమర:నా యొక్క మిగులు భూమి, ఉత్తరం :ఇదే నెంబరు భూమిలో నేను వదిలిన 14 అడుగుల వెడల్పు గల లాంబి రస్తా, దక్షిణము : 12 అడుగుల రస్తా.
కె.మల్లికార్జున ,అడ్వకేట్, కళ్యాణదుర్గం.

ప్రకటన

మనియార్ నబిరసూల్ S/o ఎం.మజీద్ సాబ్ డి.నెం.7-3-305, హిమాయత్ నగర్, రాయదుర్గం.అనంతపురం జిల్లా. Doc.No. 51/2023, సర్వే నెం. 114-బి2 లో స్థలంను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రాయదుర్గం బ్రాంచ్‌లో తాకట్టు పెట్టడం జరుగుచున్నది.ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో 7 రోజులలోపు రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజరును సంప్రదించగలరు.
హద్దులు : తూర్పు : ప్లాట్ నెం.58, పడమర: ప్లాట్ నెం.60, ఉత్తరం : 30 అడుగుల వెడల్పు గల లాంబి రోడ్డు దక్షిణము : నాయకుల సంజీవ గారి భూమి.
కె.మల్లికార్జున, అడ్వకేట్, కళ్యాణదుర్గం.

ప్రకటన

డి.హనుమంతు S/o డి. జయప్ప,D.No.1-112, వర్రహోన్నూరు గ్రామం, రాయదుర్గం మండలం, అనంతపురం జిల్లా. Doc.No.332/2021. సర్వే నెం. 72 లో స్థలంను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రాయదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైన అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో 7 రోజులలోపు రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజరును సంప్రదించగలరు.
హద్దులు : తూర్పు : ప్లాట్ నెం.66, పడమర: 30అడుగుల వెడల్పు లాంబి రోడ్డు, ఉత్తరం : ప్లాట్ నెం.34, దక్షిణము :ఇదే నెంబరు మిగులు భూమి.
కె.మల్లికార్జున ,అడ్వకేట్, కళ్యాణదుర్గం.

రేపు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

గుంతకల్లుటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంతకల్లు తాలూకా ఎన్నికలు ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కమర్షియల్ టాక్స్ కార్యాలయ ఆవరణంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌ను, సహాయ అధికారిగా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కేసీ నాగరాజును నియమించామన్నారు. ఈ ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

కిశోరి వికాసంపై అవగాహన


బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

బెళుగుప్ప, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాలికలకు కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, ఏసీడీపీఓ యల్లమ్మ, సూపర్‌వైజర్ సురేఖ పాల్గొని ఎ పౌష్టికాహారం పోషక విలువలు, ఆరోగ్య సంరక్షణ, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త సత్యవతి, ఆశావర్కర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

యాడికి, మే16(ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని రాయలచెరువులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు దేవరాజన్, అప్పయ్య మాట్లాడుతూ.. దోమకాటు అరికట్టడం వల్లే డెంగీ వ్యాధిని రాకుండా చేయవచ్చన్నారు. ప్రతిఒక్కరూ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలను నివారించవచ్చునని తెలిపారు. ర్యాలీలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు, శ్రీధరఘట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సుల్తానా, కుమార్‌రాజా ఆధ్వర్యంలో సిబ్బంది డెంగీ నివారణపై ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. డెంగీ రాకుండా ఉండాలంటే దోమలను నివారించాలని సూచించారు. ఇందుకు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని చెప్పారు. ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుల తాకిడికి 20 ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధం

కంబదూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్తనపర్తి పంచాయతీ పరిధిలో మూడు రోజుల నుంచి పిడుగుల తాకిడికి 20 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. తోటల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో పంటలకు నీరు పెట్టుకోలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లకు వెంటనే మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

రాయలచెరువులో పిడుగుపాటు

యాడికి, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో శుక్రవారం రాత్రి పిడుగుపడింది. రాత్రి 8గంటల సమయంలో ఒక మోస్తారు వర్షం కురిసింది. ఆ సమయంలో పెద్దఎత్తున మెరుపులు, ఉరుములు వచ్చాయి. పారిశ్రామికవేత్త మాదాల రామకృష్ణ పరమహంస ఇంటి ఆవరణంలోని టెంకాయచెట్టుపై పిడుగుపడింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

గజవాహనంపై ఊరేగిన శ్రీవారు

రాయదుర్గం, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గజవాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్థానిక ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేకఅలంకరణలు, పూజలు చేశారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను గజవాహనంలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


గజ వాహనంపై శ్రీవారు

19నుంచి మహా కుంభాభిషేకం

యల్లనూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 19వ తేదీ నుంచి మహా సంప్రోక్షణ కుంబాభిషేక కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు పవన్‌కుమార్‌శర్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలు నాలుగురోజులపాటు నిర్వహిస్తామన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు, యల్లనూరు భజన మండలి ఆధ్వర్యంలో భజన, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

రస్తాపై వివాదం.. ఒకరికి గాయాలు

యాడికి, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగన్నపల్లిలో రస్తాపై వివాదంలో ఇరువర్గాలు గొడవపడి దాడిచేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. ఈ ఘటనలో నరసింహ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు తమకు తమ పెద్దనాన్నకు పొలం వద్ద రస్తా వివాదం నెలకొని ఉందని, దీనిపై శుక్రవారం గొడవ జరిగిందని తెలిపాడు. ఈ సంఘటనలో సుబ్బరాయుడు, రమేష్ తనపై దాడిచేసి గాయపరిచారని అన్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు బాధితుడు తెలిపాడు.

నేడు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర

శెట్టూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జిలాని శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లోనూ నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు అధికారులు అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

వృద్ధురాలి ఆత్మహత్య

బెళుగుప్ప, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామంలో ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి (70) తరచూ కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రులలో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో శుక్రవారం నొప్పి అధికమవడంతో తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉంది. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు గమనించి వెంటనే కల్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు కుమారుడు వెంకటరమణ తెలిపారు.


లక్ష్మీదేవి (ఫైల్)

గురుకుల పాఠశాలలో సీట్లను పెంచండి

కణేకల్లు, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో అన్ని తరగతులకు సంబంధించి సీట్లను పెంచాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి మూడు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటు పడాలన్నారు. అలాగే పాఠశాలలో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు.